# దారితప్పినవాడు

సుమారుగా ఒక గంటసేపు నిలబడ్డాను. నేనెక్కవలసిన బస్సు రాలేదు. ఏవో బస్సులు వస్తున్నాయి. కొన్ని ఆగుతున్నాయి. కొన్నిఆగకుండా పోతున్నాయి. కొన్ని కాస్త మొహమాటపడినట్లు ఆగినట్టే ఆగి సాగిపోతున్నాయి. బస్సు కిటికీ ఊచల్నికూడా పట్టుకుని గబ్బిలాల్లాగ వేలాడుతున్నారు జనం. అలాగే రద్దీగా నేను ఎక్కవలసిన బస్సుకూడా వచ్చింది. రావడమేకాదు, సరిగ్గా నాముందే వచ్చి నిలబడింది. కానీ ఏంలాభం. ఫుట్‌బోర్డుమీద కాలుమోపినవాడు ఇక ముందుకు వెళ్లే ప్రయత్నం చెయ్యడు. నేను కాలయినా మోపగలనా అని నీరసపడిపోయాను. ఇంతలో నావెనకనే అసహనంగా ఉన్న జనప్రవాహంలోంచి ఒకబలమైన తరంగం నన్ను అమాంతం ఎత్తి బస్సులోకి నెట్టేసింది. కాళ్లని ఎవరో తొక్కుతున్నా తీసుకోలేని పరిస్థితిలో ఇరుక్కుపోయాను. నాచుట్టూ పాపం నాలాంటి వాళ్లే. ఎవరికీ వాళ్లచేతులూ కాళ్లూ స్వాధీనంలో లేవు. ఇద్దరుముగ్గురు స్కూలు పిల్లలు వాళ్ల వీపులమీద పుస్తకాల సంచులతో అందరి మధ్యా నలుగుతూ గాలి దొరక్క ఆవులిస్తున్నారు. ఏదో సెంటర్‌లో చాలామంది దిగడంతో కాస్త చల్లనిగాలి సోకి ప్రాణం కుదుటపడింది.

రెండు సీట్లున్న వరుసలో కిటికీ పక్కన కూర్చున్న పెద్దమనిషి దిగిపోయాడు. నేను కూర్చోవాలని నా ఆరాటం. కానీ రెండో సీట్లో కూర్చున్న బట్టతల మనిషి నన్నూ నా ఆత్రాన్ని పట్టించుకోకుండా అన్యమనస్కంగా చూస్తున్నాడు. రెండు వరుసల ముందు కూర్చున్న కుర్రవాడిమీదే ఉన్నాయి అతని చూపులు. నా మునివేళ్లతో అతని భుజం తట్టి 'కాస్త జరగండి' అన్నాను. అతను వెంటనే తేరుకొని కిటికీ వేపు జరిగి నాకు కూర్చునే అవకాశం కలిగించాడు. అంతేకాదు. "అయ్యో! నామతి...! నా ఆలోచనల్లో నేనుండిపోయాను. క్షమించండి" అని ఎంతో నొచ్చుకుంటూ నా కళ్లలోకి చూశాడు. మాటలో, ప్రవర్తనలో సంస్కారం, మొహంలో ఏదో ఆకర్షణ, దేహవర్ణం పచ్చని పసిమిఛాయ. మెరుస్తున్న ఫ్రేమ్‌లో బిగించిన సులోచనాలూ, పొడుగుచేతుల లాల్చీ, పంచెకట్టు, భుజంమీద కాసింత నలిగిన జరీకండువా. ఏదో బాధ్యతగల ఉద్యోగం చేస్తూ ఉండవచ్చు. లేదా రిటైర్ అయి ఉండవచ్చు. నేను మాటలు కలపకుండా ముభావంగానే కూర్చున్నాను. నావేపు చూసి కాస్త ఉత్సాహంగా ఏదోచెప్పాలనీ, ఏదో అడగాలనీ ప్రయత్నించి సందేహిస్తున్నట్లు కనబడ్డాడు.

నానుంచి ప్రోత్సాహం లేకనేమో ఆ సందేహం. అలా మాటామంతీ లేకుండా కొంతదూరం ప్రయాణంచేశాక అతనే కాస్త చొరవ తీసుకుని "ఆ ముందువరుసలో కూర్చున్న పిల్లవాణ్ణి చూశారా?" అని స్వరం తగ్గించి మెల్లగా అడిగాడు. అతను చూపిన దిశగానే ఆ పిల్లవాణ్ణి నాకుదొరికిన కోణంలోంచి చూస్తూ తల ఊపాను.

"మీరెక్కడిదాకా?" అతని ప్రశ్న.

"దిల్‌సుక్‌నగర్.." అన్నాను ముక్తసరిగా.

అది విన్నాక అతని కళ్లలో ఏదో వెలుగు, ఏదో మెరుపు. అతని తలను నాతలకు దగ్గిరగా చేర్చి, గొంతు చిన్నది చేసి "మీతో చిన్న విషయం మనవి చేస్తా. నాకు చిన్న సహాయం చెయ్యక తప్పదు" అన్నాడు ఆశగా. కాసింత సందేహంతో, కాసింత ఉత్కంఠతో అతని కళ్లలోకిచూస్తూనే 'చెప్పండి' అన్నాను.

"ఆ పసివాడికి గట్టిగా పదహారేళ్లయినా లేవు. వెధవాయ్ పరీక్ష తప్పాడని ఇల్లు విడిచిపెట్టి పోయాడు. వాడి తల్లి మంచంపట్టింది. తప్పిపోయినట్లు పత్రికలోనూ, టీ.వీలోనూ ప్రకటించారుపాపం. అదృష్టవశాత్తూ నాకంట పడ్డాడు. కాస్త మీ సహాయంతో వ్హాణ్ణి దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్లో చేరవేస్తే మిగతా పని వాళ్లే చూసుకుంటారు." ఆ అభ్యర్థనలో ఎంతో ఆశా, ఆత్రం వినిపించాయి నాకు.

నేను మరోసారి ఆ కుర్రవాణ్ణి చూశాను. గాలికి చెదిరిన చింపిరితలా, అమాయకమైన లేత వయసూ, గోళ్లు గిల్లుకుంటూ అటూఇటూ చూస్తూ ఉన్న ఆ కళ్లలో నిర్లిప్తత, భవిష్యత్తు అంతా నాదే అంటూ. ముందుకు చూడవలసిన యువత ఎందుకిలా పిరికి మందు తాగినట్లు దిగజారిపోతోంది అని బాధగా మూలిగింది నా మనసు. "ఇందాకా వాణ్ణి చూసిన దగ్గర నుంచి ఏం చెయ్యాలి, ఒక్కడితో అయ్యేపనికాదు. ఏం అడిగితే మళ్లా ఎటు ఉరికిపోతాడో అని తటపటాయిస్తున్నాను. మీరు కాస్త సహకరిస్తే..." బట్టతలాయన కంఠం నాలోని ఆలోచనల వలయాన్ని ఆపి కర్తవ్యాన్ని గుర్తుచేసింది. "అలాగే, తప్పకుండా నా సహాయం ఉంటుంది. కానీ ఇలాంటి విషయంలో తొందరపడితే లాభం ఉండదు. వ్యవహారం చెడుతుంది. శాంతంగా ఉండండి" అని భరోసా ఇచ్చి అతని ఆరాటానికి ఉపశమనం కలిగించాను.

దిల్‌సుక్‌నగర్‌లో అందరూ బస్సు దిగిపోతున్నారు. కుర్రవాడు కూడా జారుకుంటున్నాడు ఆ జనప్రవాహంలోకి. నేను కాస్త చొరవ తీసుకుని వాడి వెనకనే చేరి బస్సు దిగగానే మాటలు కలిపి నిలబెట్టాను. "నా పర్సు ఎవరో కొట్టేశారు. అందులో విలువైన కాగితాలు కూడా వున్నాయి. దగ్గరేదైనా పోలీస్‌స్టేషన్ ఉందా బాబూ!" అన్నాను. నావేపు 'అయ్యో పాపం అన్నట్లు జాలిగా చూస్తూ "అదిగో అక్కడే ఆ కోవెల పక్కనే" అని తన చేత్తో చూపుతూ ఇంకో దిశగా ఉరుకుతున్నాడు. "ఇదివరకు ఈ ప్రాంతం వచ్చిన వాణ్ణికాదు. కాస్త నీకు పుణ్యం ఉంటుంది. గేటుదాకా వచ్చి పో నాయనా" అని బతిమాలేను. కాస్త విసుగుదలా,

సందేహం కనపరుస్తూ కొంత దూరంవచ్చి వెనక్కు తగ్గుతున్నాడు. బట్టతలాయన కాసింత ఎడంగా నా వెంటనే వస్తున్నాడు. పెద్దమనిషి మంచి వ్యవహర్త. తొందరపాటు లేకుండా నాతో సహకరిస్తున్నాడు. స్టేషన్ గేటుకు సుమారుగా దగ్గరగా వచ్చిన కుర్రవాడి భుజంమీద నా చెయ్యి కాస్త బలంగా వేసి "ఒక్క నిముషం ఆగు, నేనుకూడా వచ్చేస్తా"నని లోపలకు వెళ్లబోతూఉంటే మొరాయిస్తున్నాడు. ఇది గమనించిన కానిస్టేబుల్ ఒకడు కాస్త ఉత్కంఠతో దగ్గరగా వచ్చి చూస్తున్నాడు. పిల్లవాణ్ణి పట్టుకోమని కంటితో సౌంజ్ఞచేశాను. ఇక మా పని తేలికయిపోయింది. అదృష్టవశాత్తూ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సీట్లో ఉండడమేకాదు, తీరిగ్గా కూడా ఏవో రిపోర్టులు చూసుకుంటున్నాడు. ఆరోజు వార్తాపత్రికలు టేబుల్‌మీద ఉన్నాయి. తల ఎత్తి మమ్మల్ని చూస్తున్న అతని కళ్లలో ఏదో విసుగుదల కనిపించింది. ఏమిటి మీ బాధ అన్నట్లు చూశాడు. బట్టతలాయనకు తన గొంతు సవరించుకోడంతోటే సరిపోయింది. నేనేకాస్త చొరవగా "వీరు ఈ కుర్రాణ్ణి గుర్తుపట్టి తీసుకొని వచ్చారు. ఇల్లు విడిచి పారిపోయాడట. టీ.వీలోనూ, పత్రికల్లోనూ ప్రకటన కూడా చేశారట. తల్లి బెంగ పెట్టుకుందట. నా సహాయం అడిగితే వీరితో కలిసి వచ్చాను" అన్నాను నీళ్లు నమలకుండా. ఆ కుర్రవాడు 'కాదండీ...' అంటూ తడబడుతున్నాడు. "పోతానంటావు. అంతేనా. సరే నువ్వు వెళ్లు" అంటూ ఆ కుర్రవాణ్ణి పంపిన ఆఫీసర్ మొహంలో ఇదివరకటి విసుగుదల మాయమైంది. ఏదో వింత ఉత్సాహం చోటుచేసుకుంది.

"ఆ కుర్రవాణ్ణి అలా వదిలేశారు. ఇంటికి వెళతాడంటారా" అని నా పక్కనే ఉన్న బట్టతలాయన ఏదోనిరాశా, బాధా, వ్యక్తంచేస్తూ నిట్టూరుస్తున్నాడు.

"మీరేమీ కంగారుపడకండి. మా జవాను వెనకనే ఉంటాడు. ఆ పిల్లవాడుఎక్కడికీ పోడు. వాణ్ణి మావాడు ఇంటికి చేరుస్తాడు" అని భరోసా ఇస్తున్న ఆఫీసర్ ప్రవర్తనా, చిరునవ్వూ చూస్తే నాకు కాస్త అయోమయంగా తోచింది. నన్నూ నా అయోమయ పరిస్థితినీ ఇట్టే అర్థంచేసుకున్న వాడిలా ఉన్నాడు ఆఫీసర్. "మీ శ్రమ దండగ కాలేదులెండి" అని, నన్ను ఓదారుస్తున్నట్లు చూసి, దగ్గరగానే ఏదోరాసుకుంటున్న రైటర్‌ని పిలిచి ఒక ఫైల్ తెప్పించాడు. ఆ ఫైల్‌ని నా చేతికి అదించి చూడమన్నాడు అర్థవంతంగా నవ్వుతూ. ఆ ఫైల్ తెరవగానే నాకు కనిపించిన ఫోటో చూసి అవాక్కయిపోయాను, ఒక్క క్షణం. "మా తండ్రిగారిది చాలా సున్నితమైన మనసు. పిల్లలు తప్పిపోయిన ప్రకటనలు చూసి చలించిపోయి వీళ్లంతా ఎక్కడికి పోతున్నారని ఆవేదన పడేవారు. ఈ మధ్య ప్రకటనల్లోని అడ్రసులు నోట్‌చేసుకోవడం చూసి సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకుని వెళ్లాను. తిరిగివస్తూ ఉండగా తప్పడిపోయారు..." అన్న వాక్యాలు మనసులోనే చదువుతూ తల ఎత్తాను. తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వేపు అమాయకంగా చూస్తున్నాడు బట్టతలాయన.

(ఈనాడు ఆదివారం, 13-10-1991)